www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 21 మే 2025
5
చిత్తూరు

'ఢీ' ఎస్సీ!

- 1324 పోస్టులకు 26,501 మంది అభ్యర్థుల పోటీ
- ఒక్కో పోస్టుకు 34 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: దీర్ఘకాలికంగా డీఎస్సీ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల ఆశలు నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్న అభ్యర్థులు డీఎస్సీ కోసం కసరత్తు చేస్తున్నారు.. ఎలాగైనా ఉపాధ్యాయ పోస్టులను దక్కించుకోవాలంటే డీఎస్సీ కోచింగ్రు పగులు పెట్టి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ డీఎస్సీ అభ్యర్థులకు చిత్తూరు ఉచిత కోచింగ్ అందిస్తున్నారు.

డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15వ తేదీకి ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,324 పోస్టులకు 45,221 దరఖాస్తులు అందాయి. అభ్యర్థులు రెండు ,మూడు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవడంతో అభ్యర్థుల కంటే దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రభుత్వం జిల్లా పరిషత్, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీ ద్వారా భర్తీ కానున్న పోస్టుల వివరాలు చూస్తే ఎస్ జి టి 976, ఎస్ఏ తెలుగు 38, ఎస్ఏ హిందీ 17, ఎస్సీ ఏ ఇంగ్లీష్ 14, ఎస్సీ మ్యాస్ 30, ఎస్ ఏ ఫిజిక్స్ 29, ఎస్ఏ బయాలజీ 63 ,ఎస్ అసోసియేల్ 130 ,ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 36, ఆశ్రమ పాఠశాలలో 05 పోస్టులు భర్తీ చేయనున్నారు.

పోస్టుల కేటగిరి ఇలా....

ఓసి 578, బీసీఏ 117, బిసిబి 139, బీసీసీ 19, బిసిడి 102, బిసి ఈ 53, ఎస్సీ గ్రేడ్ వన్ 21, ఎస్సీ గ్రేడ్ టు 294, ఎస్సీ గ్రేడ్ త్రీ 112 , ఎస్టి 95 ఉన్నాయి. మే నెల 30వ తేదీ నుండి డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. జూన్వ 6 తేదీ నుండి సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించనున్నారు.

నేడు కుప్పంకు చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక రోజు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం కుప్పం రానున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బుధవారం మధ్యాహ్నం బెంగళూరు విమానాశ్రయం నుండి హెలికాప్టర్ ద్వారా బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు గుడిపల్లి మండలం ద్రవిడ యూనివర్సిటీ చేరుకుంటారు. 12.50 గంటలకు కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానం చేరుకుని జాతర వేడుకలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.40 గంటలకు ద్రవిడ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని 2.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరు విమానాశ్రయం తిరుగు ప్రయాణం అవుతారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో తెలిపారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

కుప్పం టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు 21వ తేదీ బుధవారం కుప్పంలో పర్యటించనున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటనల కోఆర్డినేటర్ పి.వెంకటేష్ లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గుడుపల్లి మండలం ద్రావిడ విశ్వవిద్యాలయ సంఘటనలోని హెలిపాడ్ ప్రాంతాన్ని, కుప్పం పట్టణంలోని తిరుపతి గంగమాంబ దేవాలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. ఆలయ పరిధిలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లపై ఆలయ కమిటీ అధ్యక్షులు బిఎంకె రవిచంద్రబాబుతో చర్చించారు. ఇందులో భాగంగా హెలిపాడ్ నుండి ఆలయం వరకు, ఆలయం నుండి హెలిపాడ్ వరకు ముందస్తు వాహన శ్రేణిని నిర్వహించారు.

సీఎం పర్యటన భద్రత ట్రయల్‌రన్

చిత్తూరు అర్బన్: కుప్పం గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం కుప్పంకు ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా కాన్వాయ్ విధులలో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు దిశానిర్దేశం చేశారు. ద్రవిడియన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి కుప్పం పట్టణంలో ఉన్న గంగమ్మ ఆలయం వరకు ట్రయల్ రన్ నిర్వహించి, కాన్వాయ్ సిబ్బంది విధులను వివరించారు. కాన్వాయ్ లో ఉన్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి పొరపాటుకు తావివ్వకూడదని వివరించారు. కాన్వాయ్ వెళుతున్న సమయంలో ప్రతి డ్రైవర్, రోప్ పార్టీ, పైలట్ వాహన సిబ్బంది అత్యంత జాగ్రత్తగా, సమన్వయంతో వ్యవహరించాలి. డ్రైవర్లు వాహనాల మధ్య తగిన గ్యాప్‌ను పాటిస్తూ, పరిమిత వేగంతో ప్రయాణించాలి. ఏవైనా అనూహ్య పరిస్థితులు ఎదురైతే వెంటనే వాకీటాకీ ద్వారా సమాచారం ఇవ్వాలి. సిఎం ఏ ప్రదేశంలోనైనా వాహనాన్ని ఆపితే, రోప్ పార్టీ వెంటనే అప్రమత్తమై ఆ ప్రదేశాన్ని భద్రతా పరంగా కవర్ చేయాలన్నారు. రోడ్ మూసివేసి, ప్రజలను అదుపులో పెట్టాలన్నారు.పైలట్ వాహనం ముందుగా వెళ్లి మార్గాన్ని పరిశీలించాలి, ప్రమాదకర పరిస్థితులు ఉంటే వెంటనే కాన్వాయ్‌ను ఆపే సూచనలు ఇవ్వాలన్నారు. పైలట్ వాహనం ఇచ్చే సిగ్నల్స్‌ను ఇతర వాహనాలు గమనించి అనుసరించాలని ఎస్పీ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి కార్యక్రమం ముగిసే వరకు ఎవ్వరూ విధుల పట్ల అలసత్వం వహించకుండా, తమకు కేటాయించిన బాధ్యతలను అప్రమత్తంగా నిర్వర్తించి పర్యటనలో ఎలాంటి భద్రతా లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంగమ్మకు సమర్పించనున్న పట్టు వస్త్రం

పోలీసు సిబ్బందికి సూచనలు అందిస్తున్న ఎస్‌పి

వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి- యాదమరి:

వ్యాక్సినేషన్ 100శాతం పూర్తిచేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మీ జల్స్ రూబెల్ల రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టామని ఈ బృహత్తర కార్యక్రమం పూర్తి కావాలంటే క్షేత్రస్థాయిలో 100శాతం వ్యాక్సినేషన్ చేయాలని అధికారుల ఆదేశించారన్నారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలు అందరూ మీ జల్స్ రూబెల్లా వేసుకున్నారా లేదా అన్నది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ఎవరైనా వేసుకొని చిన్నారులు ఉంటే వారిని గుర్తించి నివేదికలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించాలని, ఆ మేరకు మే, జూన్, జూలై మాసాల్లో నిర్వహించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో వారందరికీ వ్యాక్సినేషన్ చేయాలని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్లు సెల్వరాని, లక్ష్మీపతి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న సిహెచ్‌వో లక్ష్మీ నారాయణ

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ వ్యవసాయాధికారి రామాజంనేయరెడ్డి

ఎరువుల దుకాణం సీజ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తుండడంతో విజిలెన్స్ వ్యవసాయ అధికారి రామాంజనేయరెడ్డి ఎరువుల దుకాణాన్ని సీజ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బిస్మిల్లా ట్రేడర్స్‌ను తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్‌పి కరిముల్ల షరీఫ్ ఆదేశాల మేరకు విజిలెన్స్ బృందం బంగారుపాలెం పట్టణం మెయిన్ రోడ్డులోని బిస్మిల్లా ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఇందులో అధిక ధరలకు ఎరువులు అమ్ముతూ యజమాని పట్టుబడ్డాడు. అనుమతులు లేకుండా, సరైన ఇన్‌వాయిస్‌లు లేకుండా, రైతులకు రసీదులు ఇవ్వడం లేదని, రికార్డులు సరిగా నిర్వహించక పోవడం వల్ల ఈ దుకాణంలోని ఒక లక్ష 35 వేలు రూపాయలు విలువ చేసే 200 బస్తాల ఎరువులతో పాటు పూర్తిగా సీజ్ చేశారు. దుకాణం లైసెన్ ను పూర్తిగా రద్దు చేయడానికి సిఫారసు చేశారు. ఈ తనిఖీలో విజిలెన్స్ వ్యవసాయ అధికారి రామాంజనేయ రెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ వెంకటరమణ, బంగారూపాలెం మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు దూడ మృతి

పాడి రైతుకు తప్పిన ప్రమాదం

పిడుగుపాటుకు మృతి చెందిన ఆవుదూడ

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి గ్రామం లో మంగళవారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు ఎన్ కృష్ణమూర్తి తులసి దంపతులకు ఓ పాడి ఆవు , దూడ వుంది. రోజుకు ఉదయం తొమ్మిది లీటర్లు , సాయంత్రం తొమ్మిది లీటర్లు లీటర్ల వరకు పాలు ఇచ్చే పాడి ఆవు, దూడ పిడుగుపాటుకు మరణించడంతో జీవనాధారం కోల్పోయామని కృష్ణమూర్తి భార్య తులసి ఆవేదన వ్యక్తం చేసింది . తన వ్యవసాయం పొలం సమీపంలో ఉన్న చెట్టుకు ఆవుని దూడని కట్టేశాడు. మంగళవారం సాయంకాలం హఠాత్తుగా ఉరుములు మెరుపులు కూడిన వర్షం ప్రారంభమైంది ఆవును దూడ తడుస్తుంది అని భావించి షెడ్డు లోపల కట్టడానికి ప్రయత్నించాడు ఇంతలో ఉన్నట్లు ఉండి ఉరుములు ఉరమడంతో పిడుగు పడి ఆ షాక్ కి పాడి ఆవు , దూడ అక్కడికక్కడే చనిపోయింది. రైతు స్వల్ప గాయాలతో బయటపడినట్లు ఆయన తెలిపారు. చెవులు సరిగా వినపడక కళ్లు మసకబారినట్లు వుందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. స్థానికులు కుటుంబ సభ్యులు హుటాహుటిన మండలంలోని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ప్రస్తుతానికి రైతుకి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. పాడి ఆవు పిడుగుపాటుకు మరణించడంతో జీవనాధారం కోల్పోయామని కృష్ణమూర్తి భార్య తులసి ఆవేదన వ్యక్తం చేసింది. పాడి ఆవు దూడ సుమారు రూ.90 వేలు ఉంటుందని పాడి రైతు అన్నారు. మూడు నెలల క్రితం సుమారు 80 వేల రూపాయలు విలువచేసే పాడి ఆవు అనారోగ్యంతో మృతి చెందిందని, రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోమలలో భారీ వర్షం

ప్రజాశక్తి- సోమల:

సోమల మండలంలో పలు పంచాయతీలలో మంగళవారం సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. పెద్ద ఉప్పరపల్లిలో మధ్యాహ్నం రెండు గంటలసేపు కురిసిన భారీ వర్షానికి చిన్నచిన్న కుంటలు, వాగులు, వంకలు వాన నీటితో నిండిపోయాయి. గార్గేయ నది కూడా వంక సాగుతూ ఉందని ఆ ప్రాంత ప్రజలకు తెలిపారు. వర్షం కారణంగా పెద్ద ఉప్పరపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సోమలలో గంగ జాతర సందర్భంగా ఏర్పాట్లు పూర్తి కాగా వర్షం కారణంగా అమ్మవారి ఊరేగింపు తదనంతర కార్యక్రమాలు ఆలస్యంగా నిర్వహించారు. నంజంపేట, ఆవులపల్లి పంచాయతీలలో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

పలమనేరు బాలాజీ కథలకు సడ్లపల్లె సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి-పలమనేరు: కవి, రచయిత, విమర్శకుడు పలమనేరు బాలాజి రాసిన ఏకలవ్య కాలనీ కథా సంపుటికి సడ్లపల్లె సాహిత్య పురస్కారం 2025కు ఎంపికయ్యిందని హిందూపురాని కి చెందిన ఆ సంస్థ నిర్వాహకులు సడ్లపల్లె చిదంబర రెడ్డి సమాచారం అందించారు. తన ఊరి పేరునే ఇంటి పేరుగా మార్చుకొని కథ, కవిత్వం, నవల విమర్శ ప్రక్రియల్లో 1991 సంవత్సరం నుండి కృషి చేస్తున్న పలమనేరు బాలాజీ తెలుగు సాహిత్యంలో తొలిసారిగా ఎరుకల జీవన గాథలను ఏకలవ్య కాలనీ పేరిట కథల పుస్తకంగా 2024 డిసెంబరులో వెలువరించారు. ఈ పుస్తకానికి ఇటీవలే కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారంతో పాటు గీతాంజలి స్మారక స్మారక సాహిత్య పురస్కారం కూడా అందుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెద్దపంజాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న బాలాజీ ఇప్పటికి నాలుగు కథా సంపుటాలను, మూడు కవితా సంపుటాలను, నవలను వెలువరించారు. కేంద్రసాహి త్య అకాడమీ ఆహ్వానంపై జాతీయస్థాయిలో తెలుగు భాషా ప్రతినిధిగా శాంతినికేతనకు వారం రోజులపాటు అతిథిగా వెళ్లి వచ్చారు. ఆయన కవిత్వం కన్నడ, మలయాళం, తుళు, ఆంగ్ల తమిళ భాషల్లో కూడా అనువాదం చెందింది. కథలు, కవిత్వం కన్నడ. ఆంగ్ల భాషల్లో అనువాదం చెంది. పుస్తకాలుగా వెలువడ్డాయి. తన రచనలకు స్మైల్ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కా రం, కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం, నూతలపాటి గంగాధరం సాహిత్య పురస్కారం, మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం, కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారం, కామాక్షి బాయి నారాయణ రావు సాహితీ పురస్కారం అందుకున్నారు. ఇలా అనేక జాతీయ అంతర్జాతీయ సాహిత్య పలమనేరు బాలాజీ. సదస్సులలో, కవి సమ్మేళనాలలో తెలుగు భాషా ప్రతినిధిగా బాలాజీ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీద రెండు పర్యాయాలు రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన రచించిన రచనలపై తెలుగు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా కవి సంధి కార్యక్రమం ద్వారా అంతర్జాలంలో జాతీయస్థాయిలో తన కవిత్వాన్ని వినిపించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ తెలుగుకవితా సదస్సులో పాల్గొని తన కవిత్వాన్ని దేశ రాజధానిలో వినిపించారు. కాగా పలమనేరు బాలాజీకి సడ్లపల్లె సాహిత్య పురస్కారం లభించడం పట్ల స్థానిక రచయితలు కవులు సాహిత్య సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ ఫెన్సింగ్ తొలగింపు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో బాలప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమిత స్థలంలో వేసిన ఫెన్సింగ్‌ను తహశీల్దార్ రవికుమార్ తొలగించారు. మంగళవారం సంబంధిత ప్రాంతానికి వెళ్లిన తహశీల్దార్ రెవెన్యూ సిబ్బంది ద్వారా ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గతంలోనే ఈ ప్రాంతంలో ఆక్రమణలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని అనంతరం దీనిపై కోర్టు స్టేటస్ కొచ్చి ఉందన్నారు. కోర్టు నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

రేపు పలమనేరులో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి- పలమనేరు: ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల కుటుంబాలకు, తదనంతరం జరిగిన ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన భారత వీర జవాన్లకు అంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు బాసటగా నిలుస్తూ మన త్రివిధ దళాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నైతిక మద్దతుగా జాతీయ సమైక్యతను చాటుతూ పలమనేరులో బుధవారం తిరంగా యాత్ర నిర్వహించనున్నారు. 22వ తేదీ బుధవారం ఉదయం స్థానిక ఎన్‌జీవో హోం వద్ద నుండి ప్రారంభమై, పట్టణంలోని పుర వీధుల మీదుగా ర్యాలీ సాగుతుందని తిరంగా ర్యాలీ ఆహ్వాన కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో పట్టణంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆందోళన ఉధృతం

సిఐటియు ఆధ్వర్యంలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల ధర్నా

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన ఉద్యోగులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల (ఉద్యోగుల) సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు మంగళవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న అరబిందో సంస్థపై చర్యలు తీసుకుని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వా లని కోరారు. వాహనాల నిర్వహణకు డీజిల్ సరఫరా చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండు చేశారు. నిరంతరం పేద మహిళలకు సేవలు అందిస్తున్న డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం ఏమిటి?' అని ప్రశ్నించారు. తొలగించిన వారిని వెంటనే పనిలోకి తీసుకోవాలని, ఎనిమిది గంటలు పని విధానం అమలు చేయాలని, ఆప్కాస్ లో కలపాలని డిమాండు చేశారు. 'డ్రైవర్లను అరవింద సంస్థ ఇబ్బందులు పెడుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?' అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏజెన్సీని రద్దుచేసి ప్రభుత్వమే తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్‌ల నిర్వహణను తీసుకోవాలని అందులో పని చేస్తున్న వారికి అన్ని సౌకర్యాలు కల్పించి వాహనాలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే డీజిల్ సరఫరా లేక వాహనాలు నిలిచిపోయాయని గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని వారిని దృష్టిలో పెట్టుకుని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జెసికి వినతి

సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ విద్యాధరికి అందించారు. జెసి స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డల ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

జేసీ విద్యాధరికి వినతిపత్రం అందిస్తున్న తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన ఉద్యోగులు

బాలేపల్లి రహదారికి మోక్షం ఎప్పుడో?

- వారం రోజులుగా కాలినడకే
- చీకటి పడితే ఇళ్లకే పరిమితం

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని బాలేపల్లి రహదారి ఇటీవల వర్షానికి పూర్తిగా గుంతలమయమైంది. ఈ కారణంగా ఆ దారిలో వాహనాలు రాకపోకలకు నరకప్రాయంగా మారింది . ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందని వాహన చోదకులు , పాదచారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో ఇళ్ల నుండి బయటి ప్రాంతాలకు వెళ్లేందుకూ ఎవరూ ఏ ప్రమాదానికి గురి కావాల్సి వస్తుందోనని భయాందోళనతో ఇళ్లకే పరిమిత మవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేసి పాదచారులకు, వాహన చోదకులకు అందుబాటులోకి తేవాల్సి వుంది.

గుంతలమయమైన ఉల్లుగుంట గ్రామ రహదారి

బాలేపల్లి దారికి మోక్షం ఎప్పుడో?

కేలపల్లి పంచాయతీ బాలపల్లి, పుంగనూరు ,బైరెడ్డిపల్లి రహదారికి కిలోమీటరు దూరం వుంది. గంగరాజు పల్లి పంచాయతీ ఉళ్లు గుంట గ్రామానికి జాతీయ రహదారి నుండి మూడు కిలోమీటర్లు దూరం వుంది. ఈ రెండు గ్రామాల రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా పాడై గుంతల మయం అయ్యాయి. గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాలేపల్లి గ్రామం వరకు సంవత్సరం క్రితం కంకర తోలి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆ కంకర గుంతలమై కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి వీలు కావడంలేదు.

వారం రోజులుగా కాలినడకే

వారం రోజులుగా కాలి నడకనే రహదారి వద్దకు వెళ్లి దూర ప్రాంతాలకు వెళుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఒళ్లు గుంట గ్రామానికి మట్టితోలి వదిలేయడంతో పూర్తిగా దెబ్బతిని అడుగు పెట్టడానికి కూడా వీలు లేకుండా గుంతలమయమైపోయిందని పలువురు వాపోతున్నారు. చాలా మంది గ్రామస్తులు గ్రామానికే పరిమితమై సాయంత్రం ఆరు గంటల తర్వాత గ్రామం వదిలి వెళ్లడానికి వీలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంకర తేలిన ఉల్లుగుంట గ్రామ రహదారి

పట్టించుకోని అధికారులు

ఈ రహదారి దుస్థితి గురించి అనేక గ్రామసభల్లో అధికారులకు, నాయకులకు తమ మొర విన్నవించుకున్నామని తెలిపారు. ఈ విషయమై అనేక సార్లు పత్రికల్లో వచ్చినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. రైతులు వర్షం వస్తే ఆనందపడతారని అయితే తమ రెండు గ్రామాల వారు వర్షం వస్తే భయాందోళనకు గురి కావాల్సి వస్తోందం టున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి తమ గ్రామాల దారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కంకర తోలి వదిలివేయడంతో అస్తవ్యస్తంగా మారిన రహదారి

యూనియన్ బ్యాంకు వద్ద సంచరించిన పాము

బ్యాంకు వద్ద పాము సంచారం

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని యూనియన్ బ్యాంకు వద్ద మంగళవారం 11 గంటల ప్రాంతంలో బ్యాంకు ఎదురుగా నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాల వద్ద పాము సంచరించింది. దీన్ని చూసి బ్యాంకు ఖాతాదారులు భయాందోళనకు గురయ్యారు. బ్యాంకు వద్ద ఉన్న ఓ ద్విచక్ర వాహనంలో నుండి పాము బయటకు వచ్చిందని పలువురు తెలిపారు. కర్రతో పామును చంపి వేశారు. దీంతో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

జీడీ నెల్లూరు డాక్టర్ బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టరు జి గురుప్రకాష్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా జి గురు ప్రకాష్ మంగళవారం బాధ్యతల స్వీక రించారు. ఈ సంద ర్భంగా గతంలో అస్సాం రాష్ట్రంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో చీఫ్ మెడికల్ డాక్టర్ గా సేవలందించారు. మండలంలో పోస్ట్ ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు డాక్టర్ గురు ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురు ప్రకాష్ కు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, సిహెచ్‌ఓ శ్రీనివాసులు, ఆసుపత్రి సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గంగజాతర కు ముస్తాబైన ఆలయం

నేడు గంగ జాతర

ప్రజాశక్తి -సోమల:
మండల కేంద్రమైన సోమల పంచాయతీలో బుధవారం గంజాతర నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి ప్రతిష్ఠించారు. గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం గ్రామంలో అమ్మవారికి కడవలలో సల్ల పోశారు. యోగాభిరామస్వామి వారి ఆలయంలో అమ్మవారి మట్టి విగ్రహాన్ని కుమ్మర కులస్తులు అందంగా తీర్చిదిద్దారు. అమ్మవారి శిరస్సును మేళతాళాలతో తీసుకొచ్చి అమ్మవారి మట్టి విగ్రహానికి అలంకరించి ఆపై అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి శివాలయం వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిరి కింద ప్రతిష్ఠించారు. ఆలయం వద్ద యువకుల ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేశారు.

ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :
ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రంలోని అన్ని ప్రోగ్రాములు మీద సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి రోగులకు అందుతున్న సేవలు గురించి ఎటువంటి ఇబ్బంది అయినా ఉందా ? అని రోగులతో మమేకమై కనుక్కున్నారు. వైద్య నిమిత్తం వచ్చి రోగులకు కచ్చితంగా ఆధార్ కార్డు తెచ్చి వైద్యం చేసుకునేలా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ రిజిస్ట్రేషన్స్ వంద శాతం చేయాలని చెప్పారు. వైద్య నిమిత్తం వచ్చే ప్రతి పేషెంటు వివరాలను ఈ హెచ్ ఆర్ లాగిన్ లో తప్పకుండా పొందుపరచాలని చెప్పారు. గర్భిణులకు అందుతున్న సేవల గురించి విచారించారు. ప్రోగ్రాములపై వివరాలు , వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పుట్టిన బిడ్డ లు అందరికీ వ్యాధి నిరోధక టీకాలను తప్పిపోకుండా వేయించాల్సిన బాధ్యత వైద్యాధికారి, ఏఎన్ఎం తల్లిదండ్రులదేనని అందరికీ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను నూరు శాతం వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం గౌరి, డాక్టర్ బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో మామిడిదే మొదటి స్థానం

- రైతులకు అందుబాటులో రాయితీ కవర్లు
- 18 లక్షల కవర్లు అందించామని అధికారుల వెల్లడి

ప్రజాశక్తి- పుంగనూరు: ఖరీఫ్ ఉద్యాన పంటల్లో మామిడిదే మొదటి స్థానం.. పంట దిగుబడి నాణ్యంగా ఉంటేనే రైతుకు ఆదాయం సమకూరుతుంది. ఇందులో భాగంగానే మామిడి పండ్ల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్రూట్ కవర్లను అందుబాటులోకి తెచ్చింది. కీటకాలు, పురుగులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ఫ్రూట్ కవర్లు ఉపయోగపడతాయి. బయట మార్కెట్లో ఒక్కో ఫ్రూట్ కవర్ ధర రూ 2.5లు ఉండగా రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై రూపాయికి రైతులకు ఉద్యానవన శాఖ అందిస్తోంది. దీనిపై నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నారని యూరోపియన్ దేశాల వారు మామిడి ఎగుమతులు తిరస్కరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లగా సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. మామిడిలోనూ అధిక దిగుబడులు సాధించే చర్యలు చేపట్టింది. దీంతో విదేశాల నుండి సైతం ముందస్తు ఆర్డర్లు వస్తున్నాయి.

రాయితీపై రూపాయికే కవరు

పుంగనూరు ఉద్యానవన శాఖ అధికారి పరిధిలో పుంగనూరు మండలంలో 2,300, పెద్దపంజాణి 4,700, గంగవరం 3,050 వేల ఎకరాలలో మామిడి సాగు అవుతోంది. ఫ్రూట్ కవర్ అవసరమైన రైతులు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు ఆ శాఖ అధికారులకు ఇవ్వాలి. ఒక్కో రైతుకు ఒక ఎకరాకు నాలుగువేలు కవర్లు లెక్కన ఒక హెక్టారుకు 10 వేలు కవర్లు రైతులకు అందిస్తామన్నారు. మూడు మండలాలకు చేరి 18 లక్షల మ్యాంగో కవర్లను రాయితీపై అందించినట్లు ఆ శాఖ అధికారి వరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో రూపాయికి రైతుకు ఉద్యాన శాఖ కవర్లను అందిస్తోంది. ఎక్కడ ఇబ్బందులు లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో ఫ్రూట్ కవర్లు రైతులకు అందుబాటులోకి తెచ్చింది. వీటిని రైతులు సక్రమంగా ఉపయోగిస్తే రెండుసార్లు వాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నాణ్యమైన దిగుబడి

మామిడిలో పూత దశ నుంచి పిందె, కాయ దశ వరకు అనేక క్రిమి కీటకాలు ఆశిస్తుంటా యి. దీని ద్వారా పంట దిగుబడి దెబ్బతినే ప్రమాదం వుంది. దీన్ని గుర్తించిన మామిడి రైతులు రక్షణగా కవర్లను కట్టి కాయలను కాపాడుతున్నారు. ఈ ఫ్రూట్ కవర్లు వాడకం వల్ల మామిడి కాయలు వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. లోపలికి ఎలాంటి వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయి. కవరు లోపలి భాగంలో నలుపు రంగు ఉండటం వల్ల మామిడికాయకు మంచి ఉష్ణోగ్రత కూడా లభిస్తుంది. దీంతో మంచి నాణ్యమైన మామిడి దిగుమతి అవుతుంది. రైతు ఆశించిన స్థాయిలో మామిడి ధరలు ఉంటాయి.

పుట్టిన రోజు శుభాకంక్షలు తెలుపుతున్న నారాయణస్వామి

మీనాక్షికి పుట్టిన రోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: నిరంతరం వైద్య వృత్తిలో ప్రజా సేవకు అంకితమై అందరి కీ అందు బాటులో వున్న జీడి నెల్లూరు వైద్య విభాగం అధ్యక్షు లు డాక్టర్ కోలారు ప్రకాష్ సతీమణి రుయాస్పత్రి (జనరల్ సర్జరీ) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోలారు మీనాక్షికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసిపి నాయకులు మంగళవారం పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వీరిది వెదురు కుప్పం మండలం.. ప్రకాష్ తండ్రి గతంలో ఎంపీపీగా ప్రజలకు సేవ చేశారు.

చిన్నశేష వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

చిన్నశేష వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి -వెదురుకుప్పం:
కార్వేటినగరం మండలంలో చిన్న శేష వాహనంపై శ్రీవారు విహరించారు. మంగళ వారం శ్రీ వేణు గోపాల స్వామి బ్రహ్మో త్స వాలలో భాగంగా రెండవ రోజు చిన్న శేష వాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి రథాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. వేద పారాయణ నడుమ వేణుగోపాలుడు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంటు మునిశేఖర్, కంకణ బట్టర్ తరుణ్ కుమార్, ఆలయ అధికారి సురేష్ కుమార్, శబరిష్, గోపాలచారి, పలువురు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:
వజ్రాల బోయకొండ గంగమ్మ కు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుండి పూతల పట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం మండలంలోని బొమ్మాయిపల్లి పంచాయతీ వజ్రాలపుర బోయకొండ గంగమ్మ ఆలయంలో బోయకొండ గంగమ్మ 26వ వార్షికోత్సవం ఆలయ వంశపారధర్మకర్త రాధమ్మ, కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు పెట్టారు. మధ్యాహ్నం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుండి బోయకొండ గంగమ్మకు ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో గంగమ్మను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గోపి, పురుషోత్తం, మండల టిడిపి గౌరవ అధ్యక్షులు జయప్రకాష్, మండల టిడిపి అధ్యక్షులు ధరణి , ప్రసాద్ కమిటీ సభ్యులు నాగరాజు గౌడ్, లేపాకుల మురళి గౌడ్, శంకరయ్య, శివలింగయ్య, జనార్దన్ గౌడ్, తులసి పాల్గొన్నారు.

తెలుగు భాషపై మక్కువ పెరగాలి

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు

సర్టిఫికెట్లు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి -గంగవరం: తెలుగు భాషపై తల్లిదండ్రులు మక్కువ పెంచుకోవాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు కోరారు. మంగళవారం కళామందిరంలో ఉచిత వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసినాథం నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆంగ్లభాషపై మోజుతో పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రాకపోయినా పట్టించు కోవడం లేదన్నారు. అందుకే వేసవి శిక్షణా శిబిరంలో తెలుగు చదవడం, రాయడం నేర్పించడంతో పాటు రోజుకు ఒక నీతి పద్యం, కథ నేర్పించామన్నారు. సంస్థ కార్యదర్శి పుష్ప మాట్లాడుతూ తెలుగు భాషతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పడానికి ఈ 20 రోజులు కృషి చేశామన్నారు. ప్రముఖ రచయితలు మాధవ రెడ్డి, చంద్రశేఖ రయ్య మాట్లాడుతూ సెలవుల్లో తమ సమయా న్నంతా వెచ్చించి ఉచితంగా పిల్లలకు తెలుగు భాష నేర్పడమే కాక ప్రతిరోజూ వారికి చిరుతిండి అందించడం అభినందనీ యమన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు పద్యాలు నేర్చుకొని పాడుతుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంట్లో కూడా రోజుకు ఒక పద్యం నేర్చుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఈ శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలు, గోల్డ్ మెడల్స్ బహుమతులుగా అందించారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర, నవ్య పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

విధులు సక్రంగా నిర్వహించని అధికారులపై ఎంపీపీ ఆగ్రహం

మండల సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, అధికారులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రజలకు అందుబాటులో వుండి సేవలు అందించాలని అలా లేకుండా విధులు సక్రమంగా నిర్వహించని అధికారులపై ఎంపిపి మొగసాల రెడ్డప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ , ఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో విధులు సక్రంగా నిర్వహించని అధికారులపై ఈ సందర్భంగా ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు అందరూ రావాల్సి ఉండగా కొంతమంది గైర్జారు కావడంతో వారిపై ఎంపీపీ మండిపడ్డారు. మండలంలోని విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్ల రైతులకు అందాల్సిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అంతే కాకుండా గ్రామ క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం ఎక్కువగా ఉందని తమ దృష్టికి ఫిర్యాదులు వస్తున్నాయని ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవోకి సభలో తెలిపారు. ఉద్యాన శాఖ వారు మాట్లాడుతూ మూడు నెలలుగా బొప్పాయికి ప్రభుత్వం డబ్బు అలాగే వుందని బొప్పాయి మొలకలు కొన్న రైతులు బిల్లు, వ్యవసాయ పొలంలో నాటిన మొక్కలు ఫొటోలు అందజేస్తే ప్రభుత్వం రాయితీ అందిస్తామని ఆమె తెలిపారు. ఉపాధి హామీ ద్వారా పనిచేస్తున్న వారికి కూలి డబ్బు పెంచేందుకు చర్యలు చేపట్టాలని, పంచాయతీ వైజ్ మస్టర్లు, పంచాయతీ కార్యాలయంలో ఎక్కడ పని జరుగుతోంది? అనే నివేదిక పంచాయతీ కార్యదర్శికి, సర్పంచికి తెలపాలని ఏపీఓని ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువ గా ఉంటే మండల నిధులతో నూతన బోర్లు మోటర్లు అందిస్తా మన్నారు. ఎక్కడ అవసరమో ఎంపీడీవోకు తెలపాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో సిసి రోడ్లు ఎక్కడెక్కడ వేశారో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దవంజాణి: మండలంలోని నిడిగుంట జిల్లా పరిషత్ హైస్కూలులో 1996–97 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అందరూ ఆనందంగా గడిపారు. వీరందరూ ఉన్నత చదువులు చదువుకోని వివిధ ఉద్యోగాలలో నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 28 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళన నిర్వహించుకోవడం ఈ సమావేశానికి విద్య బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు ముగ్గురుని పిలిచి గురుపూజోత్సవం నిర్వహించారు.అనంతరం గురువులకు జ్ఞాపికలను బహూ కరించి సన్మానించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఆనాటి విద్యార్థులు అరుణ, ధనలక్ష్మి, లలిత, సురేఖ, సుభాషిణి, స్వర్ణకుమారి, లక్ష్మీదేవి, ఆంజనేయులు, చిన్నరెడ్డెప్ప, రమేష్ బాబు, లోకనాథం, రవీంద్ర, మల్లికార్జున, నాగేంద్ర, మురళి, మునీశ్వర, మునేశ్వరుడు, సుబ్రహ్మ ణ్యం, ఎన్ సుబ్రమణి, సుబ్రహ్మణ్యం రెడ్డి, వేమారెడ్డి, శంకర్ రెడ్డి, చంగల్రారెడ్డి వారి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ముఖ్యమంత్రి కుప్పం పర్యటనను జయప్రదం చేయాలని తిరుపతి గంగమాంబ దేవాలయ కమిటీ అధ్యక్షులు రవిచంద్రబాబు కోరారు. మంగళవారం ఆయన ఆలయ ప్రాంగణంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం పట్టణంలో కలిసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర అంగరంగ వైభవంగా జరుగుతోందని, ఇందులో భాగంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించు కోవ డానికి ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో చేస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మవారిని దర్శించుకునే ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రి హోదాలో కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు అమ్మవారి దర్శనార్థం రానున్నట్టు తెలిపారు. అయితే సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా మధ్యాహ్న సమయంలో ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకోనున్నారని తెలిపారు. సుమారు 15 గంటల సమయం పాటు అమ్మవారి దర్శన భాగ్యం ఉంటుందని, అందులో కేవలం ఒక గంట సమయం మాత్రం వీఐపీలకు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి అమ్మవారి దర్శనార్థం వస్తున్న వేళ అమ్మవారి భక్తులు సమన్వయం పాటిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు

చైన్ స్నాచర్లు అరెస్ట్

బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం

ప్రజాశక్తి -సోమల, చౌడేపల్లి: మోటారు సైకిల్‌పై వెళుతూ ఒంటరిగా దారిలో వెళుతున్న మహిళలపై దాడి చేసి వారి మెడలో ఉన్న బంగారు గొలుసులు దొంగతనం చేసి పరారు అవుతూ తిరుగుతున్న ముఠాపై నిఘా ఉంచి ఇద్దరు దొంగలను పట్టుకుని వారి వద్ద నుండి 152 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ మొత్తం పది లక్షల రూపాయలు వుంటుందని పోలీసులు తెలిపారు. ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చైన్ స్నాచింగ్ ముఠాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించడంతో పలమనేరు ఎస్డిపిఓ ప్రభాకర్, పుంగనూరు రూరల్ (చౌడేపల్లి) రూరల్ సిఐ రాంభూపాల్, సోమల ఎస్ఐ శివశంకర్, పలమనేరు ఐడి పార్టీ సిబ్బంది ఏఎస్ఐ శ్రీనివాసులు నాయుడు, పీసీ అల్లావుద్దీన్ శశిధర్ ఎల్లప్ప సోమల పోలీస్ స్టేషన్ సిబ్బంది కలసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం డి నారాయణ పల్లి గ్రామం రావూరు వారి పల్లి పంచాయతీకి చెందిన పెద్ద శెట్టి శంకర(33), మదనపల్లి మండలం బసినికొండ గ్రామానికి చెందిన సదానల హరి(27) అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి విచారించగా సోమల, గంగవరం, చిన్నమండెం, పెద్దమండెం , నిమ్మనపల్లి, గాలివీడులలో ఒంటరిగా ఉన్న మహిళల మెడలో బంగారు చైన్లు స్నాచింగ్ చేసి మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్నారని పోలీసుల విచారణలో తేలిందని పేర్కొన్నారు. నిందితులను పుంగనూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి దారుణం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి దారుణంగా హింసించడం దారుణమని, ఇంత జరిగినా కూడా పోలీసులు కనీసం ఫిర్యాదు కూడా స్వీకరించకుండా, దారుణానికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయకపోవడం వెనుక కూటమి ప్రభుత్వ చేతకానితనం తేటతెల్లంగా కనిపిస్తుందనీ నగరి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు ఈజీ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను కాపాడటంలో కూటమి ప్రభుత్వ నాయకులు పోలీసులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని, ప్రభుత్వంలో భాగస్వామ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు దళితులకు ఎంత ద్రోహం చేస్తున్నారో, దళిత సామాజిక వర్గాన్ని అణగదొక్కేందుకు ఎంతగా ప్రయత్నిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఇకనైనా బాధ్యతతో వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా చర్యలు తీసుకోవడంతో పాటు బాధితునికి తక్షణంగా పరిహారం అందించాలని లేనిపక్షంలో ఛలో తిరుపతి కార్యక్రమానికి పిలుపునివ్వాల్సిన అవశ్యకత ఏర్పడుతుందని హెచ్చరించారు.

పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

పార్టీని బలోపేతం చేయాలి

మాజీ మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పార్టీ శ్రేణులకు జగనన్న ఇచ్చిన పదవులు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, ప్రజలకు అండగా నిలబడటానికి ఇచ్చిన బాధ్యతని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శిగా నియమితులైన గోవర్ధనం నాయుడుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మాజీ మంత్రిని ఆమె స్వగృహంలో కలిసి గజమాల, దుస్సాలువలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పదవులతో పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. పాలక ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజా సమస్యలపట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారికి అండగా నిలబడాలన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన నాయుడు మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవిని బాధ్యతతో నెరవేరుస్తానన్నారు. పార్టీ మండల అధ్యక్షులు శివరాజు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జూనియర్ ఎన్టీఆర్ 42వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక పిసిఆర్ సర్కిల్ వద్ద అభిమానులు నిర్వహించిన కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఏఎస్ మనోహర్ భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, ఉపాధ్యక్షులు భాను ప్రకాష్, అసోసియేషన్ నాయకులు సుధీర్, మైను, సంపత్, కిరణ్, మహేష్ చౌదరి, వినయ్ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీలోని పిళ్లారికుప్పం గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గంగమ్మకు అభిషేకం పూజలు నిర్వహించి అంబళ్లు, పొంగళ్ల తో నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాయంత్రం అమ్మవారాకి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి,వార్డు మెంబర్ మురళి, పాలశేఖర్, దేవరాజులు, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లాఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని రామానుజ పల్లి పంచాయతీ అంగనవాడి కేంద్రంలో స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ మంజుల విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చదువు విషయంలో శ్రద్ధ కలిగి ఉండాలని అన్నారు. అలాగే పోషకాహారం తీసుకోవడంలో, ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళ సంరక్షణ కార్యదర్శి గీత మాధురి మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాల వంటి వాటి గురించి కిశోర బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ రామచంద్రయ్య, అంగన్వాడి కార్యకర్త శారద, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సమిష్టి కృషి ఫలితంగానే అధికారం

- 'మహానాడు'లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్
- 25 తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నాయకులు, యువత, మహిళలు, కూటమి పార్టీల సమిష్టి కృషి ఫలితంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. కలిసికట్టుగా ప్రతి ఒక్కరూ కష్టపడడం వల్లే చిత్తూరులోనూ విజయం సాధించామని.. ఇది సమిష్టి విజయం అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ చెప్పిన పని ప్రతిఒక్కటి ఫలితం ఆశించకుండా చేయడం వల్లే విజయం సాధించామని.. 2014 నుంచి టిడిపి, సీఎం , లోకేష్ అప్పగించిన ప్రతి బాధ్యతను చిత్తశుద్ధితో పూర్తి చేశానన్నారు. కలిసి వచ్చే అందర్నీ కలుపుకొని వెళ్లాలని ఉద్దేశంతోనే.. చిత్తూరులోని మాజీ ఎమ్మెల్యే అందరినీ కలిసి మద్దతు అడిగానని.. ప్రతి ఒక్కరూ తమ మద్దతు తెలియజేసి ఎన్నికల్లో విజయానికి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన దృష్ట్యా నామినేటెడ్ పదవులు, ఇతర పదవుల్లో సర్దుబాటు అవసరమైన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పదవులు రాలేదని బాధపడద్దని.. ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేస్తామని.. నష్టపోయిన నాయకులు, కార్యకర్తలకు ఆర్థిక భరోసా ఇచ్చే కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, రాబోయే రోజుల్లో పారిశ్రామికంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి స్థానిక యువతకు చిత్తూరులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే చిత్తూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారులు, ఎక్స్ ప్రెస్ హైవేల పనులు వేగంగా జరుగుతున్నాయని, బుల్లెట్ ట్రైన్ వస్తుందన్నారు. స్థానిక ప్రజల అవసరాలు, కార్యకర్తల అభిప్రాయాల మేరకు రూపొందించిన తీర్మానాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటికి అవసరమైన నిధుల మంజూరు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్సీ రాజసిం హులు, చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, పరిశీలకులు మారుతీ చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు మహానాడు ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులను ఘనంగా సత్కరించారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని డివిజన్ల వారిగా కమిటీల ఎన్నికలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, గాంధీ, పరిశీలకులు సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నాయకులు వసంత్ కుమార్, త్యాగరాజన్, మోహన్ రాజ్, పీటర్, రాజేశ్వరి, సుబ్బా నాయుడు, శశికర్ బాబు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుదాం..

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :
ఈ నెల 22వ తేదీ చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించనున్న మినీ మహానాడు సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేసి ఐక్యతను చాటాలి..' అంటూ తెలుగు తమ్ముళ్లకు, టీడీపీ శ్రేణులకు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28,29 తేదీలలో కడప వేదికగా నిర్వహించనున్న మహానాడు నేపథ్యంలో... దీనికి సన్నాహకంగా...చిత్తూరు జిల్లా పార్లమెంటు కమిటీ నేతృత్వంలో నిర్వహించే మినీ మహానాడుకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరుకానున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తెచ్చి మినీ మహానాడును జయప్రదం చేయాలనే ధ్యేయంతో చిత్తూరు ఎంపీ ముందుకు సాగుతున్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చిత్తూరు పార్లమెంటులో టిడిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయానికి అనుగుణంగా పనిచేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.